క్లుప్తంగా

నిత్య అన్నదానానికి విరాళం



చెక్కు అందజేస్తున్న వేణుగౌడ్

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి బుధవారం యాదాద్రి జిల్లా కొండమడుగు మాజీ సర్పంచ్ ఎస్ వేణుగౌడ్ రూ.5లక్షల విరాళం అందజేశారు. అదేవిధంగా ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులకు వేణుగౌడ్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, వద్దె భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శిర అశోక్ ఉన్నారు.

మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కేతేపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కేతేపల్లిలో మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాచర్ల సైదులు, నకిరెకంటి అంజయ్య, కొమ్ము వెంకన్న, మేకల విక్రమ్, దండెం జోజి, దండు వెంకన్న, మేకల భిక్షం, మట్టి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల అధ్యక్షుడిగా నరసింహ



మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన అల్వాల నరసింహ రైతు సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నరసింహను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి బుర్ర శేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ఆకుల రఘుమయ్య, కొట్టం యాదయ్య, పాగాకు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'టూల్ డౌన్' ను జయప్రదం చేయాలి

చిట్యాల: ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో నిర్వహించనున్న టూల్ హాలీడే(టూల్ డౌన్)ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో బుధవారం టూల్ డౌన్ కార్యక్రమ ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. తాడూరు చంద్రం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వరికుప్పల హన్మంతు, తోట శ్రవణ్‌కుమార్, చిట్యాల మండల అధ్యక్షుడు బరాల స్వామి, బెల్లి యాదయ్య, నర్సింహ, మంచాల గణేశ్, లింగస్వామి, రమణ పాల్గొన్నారు.

రుణమాఫీపై దుష్ప్రచారం చేస్తున్న కేటీఆర్



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

కనగల్: రైతు రుణమాఫీపై కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం కనగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవిరెడ్డి వెంకట్ రెడ్డి, కూసుకుంట్ల రాజారెడ్డి, మాజీ సర్పంచులు గోలి జగాల్ రెడ్డి, బోగరి రాంబాబు, గోగు యాదయ్య, నేలగందరాశి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: నల్లగొండలో నిర్మించిన 552 ఇళ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. బుధవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, అవుట రవీందర్ , ఊట్కూరు మధుసూదన్ రెడ్డి, నాగరాజు, వెంకటయ్య, ఎస్‌కే లతీఫ్, సుల్తాన్, ఫాతిమా బేగం, గౌసియా బేగం, నగీన, రజని పాల్గొన్నారు.

నెరవేరిన గట్టుప్పల్ ప్రజల కల

- నేడు మండల పరిషత్ కార్యాలయం ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు సంవత్సరాల క్రితమే గట్టుప్పల్‌ను మండలంగా ప్రకటించినప్పటికీ ఇక్కడ మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేదు. కేవలం రెవెన్యూ సేవలు మాత్రమే అందేవి. మిగిలిన ప్రభుత్వ సేవలకు జనం నానా అవస్థలు పడేవారు. గట్టుప్పల్ మండల ప్రజలు ప్రతి పనికి పాత మండలాలకు పరుగెత్తాల్సి వచ్చేది. మండల పరిషత ఏర్పాటుతో ప్రజలకు ఇక ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. రెవెన్యూ మండలంగా కొనసాగుతున్న గట్టుప్పల్‌ను మండల పరిషత్‌గా మారుస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ గత సంవత్సరం నవంబర్ 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి నుంచి అధికారికంగా గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయం ప్రారంభానికి ఆదేశాలు అందాయి.



గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయం

అధికారులు, సిబ్బంది నియామకం

నూతన మండల పరిషత్ కార్యాలయానికి ఎంపీడీఓగా మాధవరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. ఆయన మంగళవారం విధుల్లో చేరారు. బుధవారం సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఒక రికార్డు అసిస్టెంట్‌తో పాటు ఇద్దరు అటెండర్లు విధుల్లో చేరారు. గురువారం అధికారికంగా గట్టుప్పల్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘానికి చెందిన భవనంలో మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

గట్టుప్పల్ మండలంలో ఏడు గ్రామాలు..

నూతనంగా ఏర్పాటు చేసిన గట్టుప్పల్ మండలంలో మునుగోడు మండలం నుంచి వెల్మకన్నె (2517 జనాభా), చండూరు మండలం నుంచి గట్టుప్పల్ (6346), తేరట్‌పల్లి (2530), కమ్మగూడెం (576), శేరిగూడెం (675), మర్రిగూడ మండలం నుంచి అంతంపేట(2645), నామాపురం (1302) గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక నుంచి ఆ ఏడు గ్రామాల ప్రజలకు గట్టుప్పల్ మండల కేంద్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సేవలు అందనున్నాయి. రెవెన్యూ, విద్యుత్, విద్యాశాఖ, తాజాగా మండల పరిషత్ కార్యాలయానికి గెజిట్ విడుదల కావడంపై గట్టుప్పల్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు సైతం గెజిట్ విడుదల చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సిబ్బంది విధుల్లో చేరారు



గట్టుప్పల్ మండల ప్రజలకు ఇక నుంచి మండల పరిషత్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మండల పరిషత్ కార్యాలయం ప్రారంభించేందుకు జిల్లా అధికారుల నుంచి అధికారికంగా ఆదేశాలు అందాయి. గురువారం మండల పరిషత్ కార్యాలయం ప్రారంభిస్తున్నాం. సంబంధిత సిబ్బంది కూడా విధుల్లో చేరారు.

–మాధవరెడ్డి, గట్టుప్పల్ ఎంపీడీఓ

ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి



గట్టుప్పల్ మండలానికి మండల పరిషత్ గెజిట్ విడుదల చేయించి కార్యాలయ ప్రారంభానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఇక నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి. గట్టుప్పల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. పోలీస్ శాఖకు సంబంధించిన గెజిట్ కూడా విడుదల చేయాలి.

–నామని జగన్నాథం, గట్టుప్పల్ మండలం

ఆర్టీసీకి ప్రయాణికుల భద్రత ముఖ్యం



రామగిరి(నల్లగొండ): రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రామగిరి(నల్లగొండ): ప్రయాణికుల భద్రత ఆర్టీసీకి ఎంతో ముఖ్యమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ శిబిరం ద్వారా 105 యూనిట్ల రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఆర్టీసీ ఆర్‌ఎం కె.జానిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 7 డిపోలకు చెందిన ఉద్యోగులు రక్తదానం చేశారన్నారు. ఆర్టీసీకి చెందిన వెంకట్‌రెడ్డి 51 మార్లు, ఎం.ప్రభాకర్‌రావు 38 మార్లు రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు మాధవి, శివశంకర్, డిపో మేనేజర్ శ్రీనాథ్, ఎన్నమల్ల అంజయ్య, నేతి విప్లవకుమార్, సద్దాం హుస్సేన్, రెడ్‌క్రాస్ సిబ్బంది సీవీ రాములు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, వాణి

కామినేని మెడికల్ కళాశాలలో..

నార్కట్‌పల్లి : సహనంతో వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ చైర్మన్, రిటైర్డ్ ఆర్టీఓ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వాణి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక కామినేని మెడికల్ కాలేజీ ఆవరణలో రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్, డీటీసీ సంయుక్తంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నిబంధనలు తెలిసి ఉండాలన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు. ప్రమాదాల రహిత రాష్ట్ర నిర్మాణం కోసం యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీ.ఎల్ సహాబ్, రిటైర్డ్ ఆర్టీఓ విజయపాల్‌రెడ్డి, ఎంవీఐలు లావణ్య, కొండయ్య, మల్లికార్జున్‌రెడ్డి, చంద్రశేఖర్, స్వప్న, భాస్కర్‌రెడ్డి, ఏఎంవీఐ సోనిప్రియ, కిరణ్, ఆర్టీఓ ఏజెంటు బాబు, మెడికల్ కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి



నకిరేకల్ : ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది



కట్టంగూర్ : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

నకిరేకల్ : తమకు వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం నకిరేకల్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు మాసాలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీఓ రమణయ్య, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కట్టంగూర్ : తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావుకు ఉపాధి హామీ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఉద్యోగులు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ చలపతి, ఏపీఓ కడియం రాంమోహన్, నాగభూషణం, రాణి, విజయలక్ష్మి, వెంకన్న, దాసరి యాదగిరి ఉన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను విడుదల చేయాలని కోరుతూ మండలంలోని ఉపాధిహామీ పథకం ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జంగమ్మ, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వెంకటాచారి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల రెన్యూవల్‌కు నిధులు మంజూరు

శాలిగౌరారం: మండలంలోని ప్రధాన మూడు బీటీ రోడ్ల రెన్యూవల్‌కు రూ.5.54 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాలిగౌరారం మండల కేంద్రం నుంచి భైరవునిబండ వరకు 9 కిలోమీటర్లకు రూ.2.25 కోట్లు, భైరవునిబండ–అమ్మనబోలు రోడ్డు (రామాంజాపుర క్రాస్‌రోడ్డు వరకు) 5.20 కిలోమీటర్లు రూ.1.31 కోట్లు, గురుజాల నుంచి ఉప్పలంచ వరకు 8 కిలోమీటర్లు రూ.1.98 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నిధుల విడుదలకు సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు కందాల సమరంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

మర్రిగూడ : రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం కోరారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అల్వాల నరసింహ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి బుర్ర శేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ఆకుల రఘుమయ్య, బొల్లం యాదయ్య, బుర్ర వెంకటయ్య, కర్నాటి శేఖర్, అయితపాక హరికృష్ణ మొగిలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఆటలు



తాడులాగు ఆట ఆడుతున్న విద్యార్థులు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో బ్యాగ్‌లెస్ డేస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 6,7,8వ తరగతి విద్యార్థులకు సంప్రదాయ ఆటలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, కుంటి ఆట, కర్చీఫ్ ఇలా పలు సంప్రదాయ ఆటలు ఆడించారు. ఆద్యంతం వినోదభరితంగా ఆటలు కొనసాగాయి. ఆటలు ఆడుతూ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఎం. శంకరయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని సంప్రదాయ ఆటల మెళుకువలు, ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏ.రవికుమార్, సందీప్, మధుబాబు, ఉత్కర్ష్, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా కిట్లతో వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు

శాలిగౌరారం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని లయన్స్‌క్లబ్ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల చైర్‌పర్సన్, యూత్ ఎంపవర్‌మెంట్ ట్రైనర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. వల్లాల ప్రభుత్వ మోడల్‌స్కూల్ విద్యార్థులకు బుధవారం శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 221 ప్రభుత్వ పాఠశాలలకు తన సొంత ఖర్చులతో క్రీడాకిట్లను అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో శాలిగౌరారం, నల్లగొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు డెంకెల సత్యనారాయణ, పిచ్చయ్య, శంభులింగారెడ్డి, బుడిగె శ్రీనివాసులు, దునుక వెంకన్న, గుండ్ల రామ్మూర్తి, మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసులు, మల్లేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

నల్లగొండ: పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ జూనియర్, ఒకేషనల్ కళాశాలల్లో బుధవారం యాంటి డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎన్‌సీసీ నల్లగొండ, సూర్యాపేట తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పి.భిక్షపతిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం, రవాణా సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1908కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మేరుగు రాకేండ్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నర్సింహ, వన్‌టౌన్ ఎస్ఐ శంకర్, వైస్ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భిక్షపతిరావు

ధరణి సమస్యలు పరిష్కరించండి



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నార్కట్‌పల్లి : ధరణిలో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. బుధవారం నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ యాణాల అశోక్‌రెడ్డితో కలిసి సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ విజయరెడ్డి, ఆర్ఐలు తరుణ్, భవాని, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లికి చెందిన పీఆర్ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అందించనున్న స్టడీ మెటీరియల్‌ను బుధవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి సోమజ్యోతి, చెల్లం వెంకటేష్, ఎం.శివాని తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ధ్వంసం

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులోని దాడి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వ్యవసాయ పొలం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ మోటారు పైప్‌లైన్ ధ్వంసం చేశారు. నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు.

కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

కనగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తిరందాసు కనకయ్య విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, భిక్షం, మాలోతు శ్రీను, పాలకూరి సరిత పాల్గొన్నారు.

31 నుంచి వజ్రోత్సవాలు

నల్లగొండ: సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్‌ను స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 31న వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హృదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1965లో పాఠశాలను స్థాపించిన నాటి నుంచి వేలాదిమంది విద్యార్థులకు విద్యను అందించడం సంతోషంగా ఉందన్నారు. వేడుకలకు పూణే ప్రావిన్స్ చైర్మన్, ప్రావిన్షియల్ సుపీరియర్ జైకో గెర్వాసిస్ అధ్యక్షత వహించనున్నారని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం వజ్రోత్సవాల పోస్టర్, ఆహ్వానపత్రిక ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సెయింట్ ఆల్ఫోన్సస్ ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జ్ కేథరీన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, జిలాని, స్వర్ణన్, ఉపాధ్యాయులు బాలశౌరి రెడ్డి, జయంత్ కుమార్, సుందరి, లూర్దు రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఏచూరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని మదీనా కాలనీ కెవనెంట్ చర్చిలో దివ్యాంగులకు బుధవారం ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ శక్తి న్యూ వాయిసెస్ సహకారంతో 14 మంది దివ్యాంగులకు నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఎం ప్రెసిడెంట్ జెస్సీ పాల్, కోఆర్డినేటర్ సాలోమన్, లయన్స్ క్లబ్ సభ్యులు శివశంకర్ శివాద్రి, కేవీ ప్రసాద్, మురళీధర్‌రెడ్డి, కోడె సతీష్‌కుమార్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, చిలుకూరి రామకృష్ణ, మోహన్ ఐతరాజు, పెండ్యాల సరిత, టి.ఇందిరా, తబిత, ప్రీతి, రేకల భద్రాద్రి, సిస్టర్ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

కేతేపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య విమర్శించారు. బుధవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకంతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఏళ్ళ అశోక్‌రెడ్డి, వీరబోయిన సైదయ్య, అంజయ్య, పిచ్చయ్య, లింగయ్య, పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ట్రైనీ ఎస్ఐ రాజీవ్

మర్రిగూడ : రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు నిర్వహిస్తున్నామని మర్రిగూడ ట్రైనీ ఎస్ఐ కె.రాజీవ్ అన్నారు. బుధవారం మండలంలోని శివన్నగూడలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, అక్రమ మద్యం తరలింపు నిర్మూలనకు చొరవ చూపుతున్నామన్నారు. ఆయన వెంట సిబ్బంది నరేందర్, రమేష్, కోటేష్, అశోక్, వినూక్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం షురూ..

- రూ.5 లక్షల నిధులతో పనులు ప్రారంభం
- నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇళ్లు మంజూరు
- ప్రభుత్వాన్ని అదనంగా మరో 2 వేల ఇళ్లు కోరిన ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం మండల స్థాయిలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయం కోసం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.5 లక్షల నిధులతో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన విషయం విదితమే. నకిరేకల్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో మండలాలకు, ఆయా గ్రామాలకు కేటాయింపు ప్రక్రియ పూర్తి కాలేదు. అదనంగా మరో రెండు వేల ఇళ్లు కావాలని, సీఎం రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కోరారు.



నకిరేకల్‌లో కొనసాగుతున్న మోడల్ ఇంటి నిర్మాణం (హౌసింగ్ కార్యాలయం)

పైలెట్ ప్రాజెక్టు కింద ఒక్కో మండలంలో ఒక్కో గ్రామం..

నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. అందులో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. నియోజకవర్గంలోని మండలాల్లో ఇటీవలే ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. అందులో నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా 55 మంది లబ్ధిదారులకు మాత్రమే ఎమ్మెల్యే వేముల వీరేశం మంజూరు పత్రాలు అందజేశారు. ఈ ఒక్క గ్రామంలోనే ఇందిరమ్మ ఇంటి కోసం అర్హత కలిగిన వారు 71 మంది ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ గ్రామంతోపాటు మిగతా అన్ని మండలాల్లో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాల కింద లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరంగా సాగుతోంది.

అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం



ఇందిరమ్మ పథకం కింద నకిరేకల్ నియోజకవర్గానికి మొత్తం 3500 ఇళ్లను ప్రభుత్వం అధికారంగా మంజూరు చేసింది. అదనంగా మరో రెండు వేల ఇళ్లు కావాలని, సీఎం రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లా. వారు కూడా సానుకూలంగా స్పందించారు. తొలి దశలో ఇళ్లు లేని పేదలకు ప్రాధాన్యత ఇస్తాం. దశల వారీగా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు తప్పక ఇస్తాం.

–వేముల వీరేశం, ఎమ్మెల్యే నకిరేకల్